## ఆ రోజు నాకు పోస్టులో వచ్చినవి నాలుగు ఉత్తరాలు.

ఒకటి : నా చిరకాల మిత్రుడు అన్నమాట ప్రకారం నేను కథ రాసి ఇవ్వనందుకు నన్ను 'గాడిదా' అని సంబోధిస్తూ నేనెందుకు గాడిదనయానో విపులంగా రాసిన వుత్తరం.

# ఏమి చెప్పేది?

గొల్లపూడి మారుతీరావు

రెండు: మా ఆవిడ క్రితం దసరాకి కొన్న కోయంబత్తూరు చీరల బాపతు 200 అర్జంటుగా కట్టమని బట్టల షాపు నుంచి శ్రీముఖం. మూడు: మా పెద్దవాడు అనవసరంగా కథలు గట్రా రాస్తూ చదువు పాడు చేసుకుంటున్నాడనీ, ఈ లెక్కన వాడిని కాలేజీలోంచి తీసెయ్యాల్సి వుంటుందనీ వాళ్ళ కాలేజీ ప్రిన్సిపాల్ విశాఖపట్నం నుంచి చేసిన హెచ్చరిక. నాలుగోది: శ్రీకంఠయ్య రాసిన ఉత్తరం. స్థూలంగా రెండు వాక్యాలు. సరస్వతి నిన్ననే ఆసుపత్రిలో పోయింది. కొలెస్ట్రల్ ఎక్కువగా ఉందనీ ఆ కారణం వలన గుండెల్లో రక్తప్రసారానికి అభ్యంతరం ఏర్పడి కన్ను మూసిందనీ డాక్టరు అంటున్నారు- అని.

చాలా విలువయిన పాత పుస్తకం లోంచి కాగితం చిరిగిపోయినట్టుగా మనసు చివుక్కుమంది. సాయంకాలం వేపు పరుగులు తీస్తున్న ఈ యిరుకయిన జీవితంలో సరస్వతి ఓ పాత జ్ఞాపకం. అలసిపోకుండా ముందుకూ, వెనక్కూ పరుగులు తీసే సముద్రం కెరటాలు. దివ్యమనే పంచు ముద్ద స్పర్శ, తడిసి ముద్దయిపోతూ వర్షంలో నడుస్తున్నప్పుడు కాలికి గుచ్చుకొనే ముల్లు నొప్పి - యిలాంటి చిన్న చిన్న అనుభవాల సమష్టి రూపం సరస్వతి.

దగ్గర్లో యిసకలో కూడని గుజ్జనగూళ్ళు ఆడుకొంటున్న నా మనుమల్ని చూశాను. ఎదురుగా తడిబట్టలారేసుకున్న మా ఆవిడ. పాతికేళ్ళ క్రితం నేను కాస్త బాగుంగా, అల్లరి చిల్లరిగా ప్రవర్తించి వుంటే ఆ స్థానంలో సరస్వతి ఉండేది. అప్పుడూ పనులన్నీ సరస్వతి నన్నే చేయమనేదేమో; నా మనవలు ఎలా వుండేవారో మా పెద్దవాడు అనవసరంగా కథలు రాసేవాడు కాదేమో నా జుత్తు అక్కడా అక్కడా నెరిసిపోతుండేది, నాది యీ అప్పు బోలిక సాహితీ లోకం లోంచి సెలవు తీసుకుని చాలా ఏళ్ళయింది. ఈమధ్య నా రచనల గురించి ఎవరూ మాట్లాడుకోవడంలేదు. నా అభిప్రాయాలు చాలా మట్టుకు కాలదోషం పట్టిపోయాయి. నాలాగే నా అభిప్రాయాలకీ వయసు మించిపోయింది గావును. నా కొడుకు రాసే కథల్లో ఏం చెప్తున్నాడో ఒక్కసారి రాసి కనుక్కోవా



లనిపించింది. వాడిని అభినందించడానికి కాదు. నా ముందుతరం నన్ను పక్కకి తోసివెయ్యడానికి ఏ కొత్త అర్హతలు సంపాదించుకొందో తెలుసుకోడానికి.

నిన్న సరస్వతిని చూస్తే ఎలా వుండేదో మనస్సులో గుర్తున్న ఆ ముఖానికి కాస్త ముడతలు అతికించి, జుత్తుకి తెల్లరంగు వేసి పెద్ద ఫ్రేము కళ్ళద్దాలు పెట్టి చూసుకున్నాను. సరస్వతిలో వృద్ధాప్యం చాలా గంభీరంగా వుంటుంది చూడగలిగితే. సరస్వతిలో వృద్ధాప్యపు ఛాయలు చాలా కాలం నుంచీ ఉన్నాయనిపించింది. మానసికంగా నాకు తెలిసిన నాటికే గంభీరమయిన వ్యక్తి సరస్వతి.

శ్రీకంఠయ్య పెళ్ళి చేసుకుని యిరవై ఏళ్ళయింది. వాళ్ళిద్దరికీ పిల్లలు లేరని ఒకటి రెండుసార్లు అబార్షను అయాయని ఎప్పుడో పిడదవోలులో ఒకసారి శ్రీకంఠయ్య కనిపించి చెప్పాడు.

అది శ్రీకంఠయ్యను నేను కలుసుకోవడం రెండోసారి. తెల్లగా బట్టతలతో నిటారుగా సన్నగా వున్న విగ్రహం. బట్టతల వాళ్ళ కుటుంబంలో ఆనవాయితీట. ఈ బట్ట

తల లేకపోతే సరస్వతిని చేసుకొనే వాడిని కాదు అనీదం శ్రీకంఠయ్యకు అలవాట యిన జోక్ - నిలబడిన చోట నిలబడకుండా చెప్పిన మాట చెప్పకుండా హుషారుగా ఉండే మనిషి - పెద్ద బ్యాంకులో కాషియర్ గా ఉండేవాడు. ఒకసారి పదివేలు మాయం చేశాడని అతన్ని బర్తరఫ్ చేశారు. "నిజమేనా" అని సరస్వతిని అడిగాను.

"పూర్ ఫెలో! చేస్తూ చేస్తూ పది వేలా మాయం చెయ్యడం? దొంగతనానికి కొత్తగా విలువ లేకుండా చేశాడు కనీసం పేపరో ఫోటో అయినా వెయ్యలేదు. ఏమిటో ఈ చచ్చు దొంగతనాలు" అంది.

శ్రీకంఠయ్య తర్వాత ఎక్కడా ఉద్యోగం చెయ్యలేదు. ఏలూరులో స్టేషనరీ దుకాణం పెట్టాడు. తర్వాత ఒకటి రెండు నవలలు అచ్చువేశాడు. ఆ వ్యాపారం దివాలా తీసేముందు అచ్చేసిన ఆఖరి నవల నాదే.

ఒక్కొక్కసారి జీవితంలో ఓడిపోతున్నప్పుడల్లా శ్రీకంఠయ్య కృంగిపోయే వాడు కాని, సరస్వతి ఆనందిస్తూండేది. జీవితం నియమబద్ధంగా పాకుడుపట్టిన చెరువు నీటిలాగ ఉండకూడదని సరస్వతి ఉద్దేశం. అది పారుతూ, పాటలు పాడుకొంటూ ప్రవహించాలి. మధ్యలో రాళ్ళూ, రప్పలూ మొక్కలూ. చెట్లూ అన్నీ ఉంటాయి. వాటిని సముదాయించి పలకరిస్తూ పోతూ వుండాలి. ఈ గంభీరమయిన జీవనశక్తి తెగిస్తూ పరుగులు తీసే ఉల్లాసమయిన మనస్తత్వం ఓటమిలోనే ఆత్మస్థైర్యాన్ని పూరించుకొనే ధైర్యం ఇవన్నీ సరస్వతిని విలక్షణమయిన వ్యక్తిని చేసాయి.

పాతికేళ్ళ క్రిందట నా చదువు పూర్తయిన తొలి రోజుల్లో మిత్రులతో సింహాచలం పిక్నిక్ వెళ్ళినప్పుడు మొదటిసారి సరస్వతి కనిపించింది. విరగ బూసిన గన్నేరు చెట్ల మధ్య పరుగులు తీస్తూ, మధ్య మధ్య మొక్కల కంచెల అవతల వేలాడే మామిడి కాయల్ని రాళ్ళేసి కొట్టి రాలుస్తూ - ఆ కొండంతటినీ తన యౌవన సామ్రాజ్యం చేసుకొంది. సరస్వతి నవ్వడానికి పెద్ద కారణాలు అక్కరలేదు. ప్రతి చిన్న విషయానికీ సుడులు తిరిగి పోతూ నవ్వుతూంది. అసలు ప్రతి చిన్న విషయం నవ్వడానికి అర్హమయినదా కాదా అని ఆలోచిస్తుంది గావును ఆ మధ్యాహ్నం కొండ మీద పనస చెట్ల కింద మేమంతా కూర్చుని మధ్యాహ్న భోజనాలు చేస్తున్నప్పుడు ఉన్నట్టుండి మా మధ్యకి వచ్చింది. కాస్త ఎడంగా మిగతా స్నేహితురాళ్ళంతా ఉన్నారు

చేతిలో పులిహోర తింటున్న కాగితపు పొట్లం మీలో ఫలానా రచయిత ఎవరు అని సూటిగా అడిగింది. కథలకి కారణాలు వెదుక్కుంటున్న రోజులవి. నా కింత అందమయిన అమ్మాయిలో ఆసక్తి రేపినందుకు ఆనందపడుతూ నేనే అన్నాను. "మీరా! - మీరు రచయిత లాగ లేరే పరీక్ష ఎగ్గొటిన హైస్కూల్ స్టూడెంటు లాగ ఉన్నారు." అని నవ్వింది.

మా మిత్రుడు పక్కున నవ్వేశాడు. "ఏంలేదు సార్. నా పులిహోర పొట్లం మీద మీ కథ సగభాగం వుంది. మీ పేరు ఎవరో చెప్పారు నా మధ్యాహ్న భోజనానికి యింత రుచికరమయిన ఆధారంగా మీ



కథ ఉపయోగించినందుకు మీకు అభినం దనలు చెప్పాలని వచ్చాను" అంది.

అదే సరస్వతితో నా మొదటి పరిచయం. నా సమర్థత పూర్తిగా ఓడిపోయిన మొదటి వ్యక్తి సమక్షం అది. రచయితగా అవతరించాలని కలలు కంటున్న కొత్త రోజులు మరి యిలాంటి ఎదురు దెబ్బ తగిలేసరికి తల తిరిగిపోయింది. ఆ క్షణంలో ఆమె వాలే తిరిన ముక్కు అందమయిన కళ్ళు, చిక్కటి చిరునవ్వు ఏవీ నన్ను మోసం చెయ్యలేకపోయాయి. ఆ రోజే. ఆమెని జీవితంలో మొదటసారిగా, రహస్యంగా అవమానించాను. ఆమెని అవమానించగలిగినందుకే ఆ క్షణంలో ఆనందపడి ఆ సంఘటనని సుళువుగా మరిచిపోయాను.

కాని సరస్వతి మరిచిపోలేదు. వారం రోజుల తర్వాత వరంగల్లు నుంచి నాకో ఉత్తరం వచ్చింది. అదిగో అప్పుడే ఆ అమ్మాయి పేరు సరస్వతి అని నాకు తెలిసింది. నిజానికి సింహాచలం, పులిహోర పొట్లం గుర్తు చెయ్యకపోతేనాకా విషయం, ఆ వ్యక్తి గుర్తుకొచ్చేదేకాదు. నా తొందరపాటుకినిందిస్తూ నాచాపల్యాన్ని విమర్శిస్తూ సహజంగా మగజాతికి ఉండే అగ్రిసివ టెంపర్‌మెంటుని ఖండిస్తూ చాలా పెద్ద ఉత్తరం రాసింది. అలా ఆమె విమర్శింపగలగడమే ఆమెలో శక్తి అని తర్వాత తర్వాత అర్థం చేసుకున్నాను. చేప మొప్పలతో నీళ్ళు తాగటంలాగ తేనెటీగ పువ్వులో తేనెని పీల్చుకోవడంలాగ సూర్యుడు తూర్పున ఉదయించడమంత సహజమయిన ప్రకృతి సరస్వతిది. విమర్శన లేకపోతే ఆమెలో సగం అందంలేదు. ఆ ఉత్తరం నన్ను సరస్వతి గురించి మరొక్కసారి ఆలోచించేట్టు చేసింది. ఇప్పుడు సరస్వతి జ్ఞాపకంగా చికిలించే ఆమెకళ్ళు, వెలిగితారె నియాన్‌లైట్ లాగ తళుక్కుమనే చిరునవ్వు గుర్తుకొచ్చాయి. అయితే ఆమె విమర్శించింది నా రచనని. ఆమెని ఏ విధంగా చూసినా క్షమించలేకపోయాను. తర్వాత చాలా రోజులు మా యిద్దరి మధ్య కొట్లాట ఉత్తర ఖండగా సాగింది.

ప్రతి ఉత్తరంలోనూ కొత్త కోణాలకి నా బలహీనతల్ని విమర్శించేది. నేను మరింత రెచ్చిపోయేవాడిని.

కాని రచనని మెచ్చుకోయిస్తే నా అంత బలహీనుడు లేడని సరస్వతి గుర్తించలేకపోయింది. అప్పట్లో నేను గుర్తించలేదు. నా ఆత్మ స్థైర్యమంతా నా వృత్తిది. వ్యక్తిది కాదు. ఆమె తిరుగుబాటు ఆమె వ్యక్తిత్వం. నా పొరపాటుని లేదా దురభిప్రాయాన్ని ఎప్పటికప్పుడు ఎత్తిచూపే ఫిమేల్ ఇగో స్థూలంగా సరస్వతి వ్యక్తిత్వం ఆ వ్యక్తిత్వపు గాంభీర్యాన్ని నేను ప్రేమగా దురభిప్రాయపడడానికి చాలాకాలం పట్టింది. కాని అప్పటికీ, ఎప్పటికీ నన్ను సమీక్షకు నిలిపే ఉన్నతాసనంలోనే సరస్వతి ఉంటూ వచ్చింది. సంవత్సరం తర్వాత- ఈ ఉత్తరాలకి అర్థం ప్రేమేమోనని రాశాను. 'అయితే ఏం?" అని సమాధానం. నేను పూలేని-ఇప్పుడు ఆలోచిస్తే అనిపిస్తుంది. రెండో ఉత్తరంలో నేను ప్రేమిస్తున్నానని రాసి వుంచె సరస్వతి వెంటనే సమాధానం రాసేది. "ప్రేమించి నేఖర్మ" అని.

మా బాంధవ్యానికి ప్రేమ అని గుర్తు

# స్నేహాంజలి

దీపం వద్దకు వెళ్ళాను
నీ పేరేమని అడిగాను
"నను వెలిగించిన వనిత మనసులో
అనురాగము" నని విన్నాను

చీకటి చెంతకు చేరాను
చెక్కిలి మెల్లగ మీటాను
సిగ్గు ముసుగులో నవ్విన చీకటి
బుగ్గల వెలుగులు చూశాను


అవాయి చువ్వలు ముట్టించాను
ఆకాశ మార్గం పట్టించాను
చుక్కలతో అవి గుసగుసలాడగ
చూచి,ఏమేమో ఊహించాను


ఏన్నడు నవ్వని నిర్భాగ్యులకు
కన్నీరై వున్న దౌర్భాగ్యులకు
ఆహ్లాదమిడే దీపావళి-
అంజలి ఘటించుతున్నాను

తలకు రాచుకొన తైలం లేదు
తాలింపునకే తైలం లేదు
దివ్వె వెలిగించ తైలంలేదు
అయినా మదిలో స్నేహం కలదు

తరగని స్నేహం, చెరగని స్నేహం
స్నేహమంటె నా కెంతో మోహం;
తీర దెన్నటికి ఈ దాహం,
నా స్నేహితులకు దాసోహం.

—డాక్టర్ దాశరథి






పెట్టుకొన్నాక నాలో చాలా మార్పులు జరిగాయి. స్వభావంలో తీవ్రత తిరిగిపోయింది. దానిస్థానే అభిమానం. ఆమె విమర్శల పట్ల కష్టాంగా పడే బాధ నన్ను సరిగ్గా అర్థం చేసుకోలేకపోతోందనే మధన-ఇలాంటివేవో చోటు చేసుకున్నాయి. నా ఉత్తరాలలో పరిపిరా ప్రేమ. కవిత్వం, ఉదయ సంధ్యల ఒంటరితనాలూ. విరహం. కోల అరుపులూ మొదలైనవన్నీ చోటు చేసుకున్నాయి. ఆ ఉత్తరాలకి సరస్వతి బోర్ అయేది ఆ మాట ఒకటి రెండు సార్లు సూటిగా రాసింది కూడాను- "ఏమిటా వాన్నెన్న - నాగురించి ఆలోచిస్తూ సముద్రాన్ని చూస్తూ సిగరెట్టుతో చెయ్యి కాల్చుకోవడ మేమిటి నీ మొహం. అంత వొళ్ళు తెలీకుండా" అంది.

చాలా నెలల తర్వాత - ఏదో ఉద్యోగరీత్యా తను రాజమండి వచ్చినప్పుడు - నేనూ పనిగట్టుకొని సరస్వతిని కలుసుకోడానికి వెళ్ళాను. అంత వరకు నా ఆలోచనలో ప్రేమ సరస్వతిని మరింత అందంగా తీర్చిదిదితే. కాలం ఆమెని మరింత గంభీరంగా తయారుచేసింది. ఇప్పుడు కళ్ళజోడు పెట్టుకుంది. నవ్వు కాస్త తగింది.

మా ఇదరి మధ్య 'సింహావలం' సంఘటన నాటి విసులుబాటు ఎందుకో తగ్గిపోయింది. దానికి కారణం ప్రేమని ఇవాళ గుర్తుపట్టగలను. బాధ్యతా రహితమయిన అబిగేషన్ లేని ఇద్దరు అపరిచితుల వ్యక్తిత్వాలు ఆనాటిది. బాధ్యతల్ని. వ్యక్తిత్వాల్ని ఎరువపరుచుకొని, ఒకరికొకరు చిరపరిచితులాగ కలిసిన సందర్భం ఇది.

నాకారోజు బాగా గుర్తు. అన్ని దస్రాల ప్రేమని కాగిలాల నిండా గుప్పించిన నేను-ఆమె ఏకాంతాన్ని కోరుకుంటానని ఊహించి - నన్ను గోదావరి ఒడ్డుకి తీసుకెళ్ళింది. లాకుల వెపు నడిపించింది. కాని అపరిచిత వ్యక్తిపట నేను అవమానించడానికి పెటుకున్న గురు. పరిచితమయిన వ్యక్తి ప్రేమకు పెటుకుంటుందని గుర్తుపట్టలేకపోయాను. నన్నటికి తొ - చాలా పెద్ద బోరుగా భావించి వుంటుంది.

నీతికీ. స్వేచ్ఛకీ విచిత్రమయిన లంకె వుంది నీతి పేరిట మనం చాలాసార్లు మన స్వేచ్ఛని వదులుకొంటాం. మగాడిలో బలహీనతలు కావాలి. వాటిని ఎప్పటి కప్పుడు విమర్శించే అవకాశం కావాలి. కాని ఆమె విమర్శని సజావుగా అర్థం చేసుకొని ఆ బలహీనతలకు విడాకులిచ్చి నేను దూరమయాను. వాటిని నిలుపుకోగలిగిన శ్రీకంఠయ్యా పెళ్ళి చేసుకొన్నాడు.

నేను సరస్వతిని పెళ్ళి చేసుకొన్నా చాలా త్వరగా నాకు విడాకులిచ్చేదేమో - నాకు బిడ్డల్నిచ్చి - నా మనవల్ని ఎత్తుకొని పెంచి. నేను రాసిన చెత్తంతా మహాకావ్యమనుకొనే భార్య నాకు కావాలి. ఎదురుగా తడిబటలు ఆరేసున్న మా ఆవిడతో నాలాంటి బలహీనుడిని పెళ్ళి చేసుకున్న విచారపు ఛాయలేమి కనిపించ లేదు. చంపల దగ్గర నెరిసే జుత్తూ, ఉదయపు వెలుగులో కెంపులాగ మెరిసే ఎర్రటిబొట్టూ ఆవిడ తీరిగా కనిపిస్తోంది. నా బలహీనతలు తెలిసి భరించడమే ఆవిడ బలమేమో.

కాని శ్రీకంఠయ్యా సరస్వతి మధ్యనయినా ఈ కోల్డు వార్ ఎంతకాలం సాగుతుంది. ఈ బాంధవ్యం ఎలా పర్యవసిస్తుందన్న ఆలోచన పాతికేళ్ళ పాతది. కొత్త పొరపాట్లు ఎప్పటి కప్పుడు చెయ్యడానికి శ్రీకంఠయ్య అలసిపోతే, ఆమె అభిమానంతో తన ప్రవర్తనకి ఒక అందమయిన సమన్వయాన్ని సాధించగలిగితే?-సాధించానని నెలరోజుల క్రిందటే రాశాడు శ్రీకంఠయ్య. నేను ఆశ్చర్యపోయాను. ఇంతలో ఈ ఉత్తరం సరస్వతి కళ్ళు మూసిందని ఈ సారి ఎక్కువ ఆశ్చర్య పడలేదు.

సరస్వతి గుండెలో రక్తస్రావానికి అడ్డుపడింది కొలెస్ట్రాల్ అని డాక్టర్లు అనవచ్చు. కాని తాను అడ్డుపడడానికి అవసరమయిన తిరుగుబాటు జీవితంలో లోపించడమని నా ఉద్దేశం.

సరస్వతి ఏదో దారిపక్క చెట్టుకి పూసి రాలిపోయే చిన్న గడ్డిపువ్వే కావచ్చు కాని ఆ పువ్వులో అనుక్షణం తనని తాను అలంకరించుకోడానికి జరిగే అపూర్వమయిన సంఘర్షణ వుంటుంది, అది ఆగిపోయాక పువ్వుకి అందం పెరగదు. రాలిపోతుంది. అలాగే సరస్వతి రాలిపోయింది.

శ్రీకంఠయ్యా ఉత్తరానికి సమాధానం రాస్తూ ఏం చెప్పాలా అని ఆలోచిస్తున్న నాకు ఇప్పటికి సమాధానం దొరికింది. ★

